సాక్షి
మంచిర్యాల
ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



ట్రిపుల్ ఐటీలో గుత్తాధిపత్యం

ట్రిపుల్ ఐటీలో కాంట్రాక్టర్ల గుత్తాధిపత్యం కొనసాగుతోంది. కాంట్రాక్టు గడువు ముగిసినా అధికారులు మళ్లీ టెండర్లు నిర్వహించకుండా వారికే అప్పగించడం గమనార్హం. 8లో▸

రూ.2లక్షల మాఫీ ఒక్కరికే..!

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రూ.2లక్షల రుణమాఫీ పథకంలో జిల్లాలో ఒక్కరికే రూ.2లక్షలు మాఫీ అయింది. జూలై 16 నుంచి ఆగస్టు వరకు మూడు విడతల్లో 56,020 మంది రైతుల ఖాతాల్లో నిధులు విడుదల చేసింది. చివరి విడత రూ.2లక్షల మాఫీలో లక్షా 99 వేలలోపు ఉన్న రైతులు 13,034 మంది ఉన్నారు. వీరిలో భీమిని మండలానికి చెందిన కొండగొర్ల తులసికి రూ.2లక్షలు మాఫీ కావడం విశేషం.

గరిష్టం/కనిష్టం
30.0 /25.0

వాతావరణం

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఉత్తరం దిశగా ఈదురు గాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

డిప్యూటీ సీఎంను కలిసిన కలెక్టర్



విక్రమార్కకు పూలమొక్క అందజేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కలిశారు. శనివారం డిప్యూటీ సీఎం జిల్లా పర్యటన నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఇల్లందు అతిథి గృహానికి చేరుకున్న ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లను కూడా కలిశారు.

రెసిడెన్షియల్ స్కూల్‌లో అదనపు కలెక్టర్ తనిఖీ



విద్యార్థులతో భోజనం చేస్తున్న మోతిలాల్

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌ను జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు కలియతిరిగారు. తరగతి గదులు, బోధన తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. రెస్ట్ రూం, సిక్ రూం సందర్శించారు. విద్యార్థులను ఒక్కొక్కరిని ఆప్యాయంగా పలుకరించారు. 'ఏంటమ్మా..? భోజనం సక్రమంగా పెడుతున్నారా..? తరగతి గదిలో బోధించే పాఠాలు అర్థం అవుతున్నాయా..? మీకేమైనా ఇబ్బందులు ఉన్నాయా..' అంటూ ఆరా తీశారు. అనంతరం డిస్ట్రిక్ మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజేశ్వరి, విద్యార్థులతో కలిసి సంహపంక్తి భోజనం చేశారు. వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉండడంతో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపాల్ సంధ్యకు సూచించారు.

నేడు పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలి



అభివాదం చేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: సెప్టెంబర్ ఒకటిన పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు నల్లబ్యాడ్జీలతో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, సీపీఎస్ ఉద్యోగులు భారీగా హాజరై న్యాయబద్ధమైన డిమాండ్‌ను ప్రభుత్వాలు గుర్తించే విధంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఓటరు జాబితాలో పొరపాట్లు లేకుండా చూడాలి

కోటపల్లి: గ్రామ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా అందరూ సిద్ధంగా ఉండాలని, వార్డుల విభజన, ఓటర్ల జాబితా తయారీలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం శెట్‌పల్లి, మల్లంపేట, కోటపల్లి గ్రామ పంచాయతీలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. కోటపల్లి మద్యం దుకాణం వద్ద చెత్త ఉండడంతో రూ.5వేల జరినామా విధించి వసూల్ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

అశాంతిఖని..!



శాంతిఖని షాఫ్ట్ మైన్

- గనిలో వేధిస్తున్న ప్రతికూల పరిస్థితులు
- ఊడిపోతున్న బెల్ట్.. జంక్షన్ వద్ద కూలుతున్న పైకప్పు
- పడిపోతున్న బొగ్గు ఉత్పత్తి
- భయం భయంగా కార్మికుల విధులు

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని షాఫ్ట్ మైన్‌లో ప్రతికూల పరిస్థితులు కార్మికులను తీవ్రంగా వేధిస్తున్నాయి. భూగర్భంలో పని స్థలాల్లో ప్రతికూలత కారణంగా భయం భయంగా విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నాలుగు రోజుల క్రితం పవర్ బ్రేక్‌డౌన్ సమస్య ఏర్పడగా.. రోజువారీగా భూగర్భం నుంచి సర్ఫేస్ బంకర్‌కు బొగ్గు రవాణా చేసే కన్వేయర్ బెల్ట్ జాయింట్ల వద్ద ఊడిపోవడం సర్వసాధారణంగా మారింది. కరెంటు బ్రేక్ డౌన్ వల్ల భూగర్భంలో ఏర్పాటు చేసిన పంపు మోటార్లు సరిగా పని చేయక యంత్రాలతోపాటు బోల్టర్ మైనర్ యంత్రం సైతం కొద్దిమొత్తంగా నీట మునిగింది. గని అధికారులు సరైన పర్యవేక్షణ చేయకపోవడం వల్ల ఎప్పటికప్పుడు సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగా నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించలేక కార్మికులు చతికిల పడుతున్నారు. బెల్లంపల్లి రీజియన్‌లో అత్యంత పురాతన మైన్ కావడంతో అడుగడుగునా అవరోధాలు ఏర్పడుతున్నాయి. వీటిని అధిగమిస్తూ ముందుకు సాగడానికి తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇవ్వడం లేదు. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ కేబుళ్లు కాలం చెల్లిపోయి శిథిలావస్థకు చేరుకున్నట్లు తెలుస్తోంది. ఏళ్ల తరబడి నుంచి మరమ్మతులు చేయించడమే గానీ కొత్తగా కేబుళ్లను బిగించకపోవడంతో తరచూ పవర్ బ్రేక్ డౌన్‌కు కారణమవుతున్నట్లు చెబుతున్నారు. ఇక కన్వేయర్ బెల్ట్ ఎక్కడికక్కడ పార్టులుగా ఊడి వస్తున్నా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

పడిపోతున్న బొగ్గు ఉత్పత్తి

ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో శాంతిఖని గని నుంచి బొగ్గు ఉత్పత్తి చేయడం కష్ట సాధ్యమవుతోంది. సింగరేణి విధించిన లక్ష్యానికి అనుగుణంగా రోజువారీగా 500 టన్నుల వరకు బొగ్గు వెలికి తీయాల్సి ఉండగా.. 150 టన్నుల లోపు అతికష్టంగా ఉత్పత్తి చేస్తున్నారు. పవర్ బ్రేక్ డౌన్ జరగడం, ఇతర సమస్యలు ఉత్పన్నమైన ప్రతీసారి ఉత్పత్తి లక్ష్యం అంతకు దిగువన నమోదవుతోంది. ప్రస్తుతం గనిలో బోల్టర్ మైనర్ యంత్రం ద్వారా ఉత్పత్తి జరుగుతోంది. జేఎంఎస్, సింగరేణి అధికారులు, కార్మికు ల సంయుక్త భాగస్వామ్యంతో భూగర్భంలో బొగ్గు వెలికి తీస్తున్నారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతను ఏటా లక్ష్యానికి అనుగుణంగా పెంచుకోవాల్సి ఉండగా దిన దినగండంగా నెట్టుకొస్తున్నారు. శాంతిఖని గనిని లాంగ్‌వాల్ ప్రాజెక్టుగా తీర్చిదిద్దుతామని ప్రకటించిన అధికారులు ఏళ్ల గడుస్తున్నా ఆ ప్రయత్నం చేయడం లేదు. గనిని ప్రయోగశాలగా మార్చి చోద్యం చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

బ్యాడ్ రూఫ్..!

గని భూగర్భ భౌగోళిక స్థితిగతులు సరిగా లేక, పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం చోటు చేసుకుంటున్నట్లుగా విమర్శలు వస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలో మూడు జంక్షన్లు కూలినట్లుగా కార్మికులు పేర్కొంటున్నారు. 23, 37, 34 జంక్షన్లలో మెయిన్ ఫాల్ అయినట్లుగా తెలుస్తోంది. గని రక్షణ అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షించి లోపాలు సరిదిద్దితే గానీ ఆ దారెంట నడిచే పరిస్థితులు లేకుండా పోతాయని తెలుస్తోంది. బెల్ట్ సెక్షన్ మరీ దారుణం. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన బెల్ట్ ఎప్పటికప్పుడు తెగిపోతుండడం ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతోంది. ఒక షిఫ్టు నడిస్తే మరో షిఫ్టులో తెగిపోతుండడంతో బొగ్గు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఇంత జరుగుతున్నా గని అధికారులు చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకరిద్దరు అధికారులు పదేళ్ల నుంచి ఈ గనిలోనే తిష్ట వేసి కుల సంఘాల్లో చురుకుగా వ్యవహరిస్తున్నారే గానీ గని రక్షణ, బొగ్గు ఉత్పత్తి వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి శాంతిఖని సమస్యలు పరిష్కరించాలని, ప్రత్యేకంగా కొందరు గని అధికారుల ఆటవిడుపు చర్యలను అరికట్టాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అదే తీరుగా బొగ్గు ఉత్పత్తి సాధనకు చిత్తశుద్ధితో పని చేయాలని పేర్కొంటున్నారు.

పవర్ బ్రేక్ డౌన్ సర్వసాధారణమే

గనిలో పవర్ బ్రేక్ డౌన్ సమస్యలు రోజువారీగా సర్వసాధారణంగా జరుగుతుంటాయి. బ్రేక్ డౌన్‌కు కారణమవుతున్న విద్యుత్ కేబుళ్లను ఎప్పటికప్పుడు మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకొస్తున్నాం. పురాతన గని కావడంతో సహజంగానే కొన్ని ఇబ్బందులు తప్పవు. వాటిని అధిగమించి ముందుకు సాగుతున్నాం. రోజువారీగా గని నుంచి 500 టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగాల్సి ఉండగా ప్రస్తుతం 200 టన్నుల వరకు ఉత్పత్తి అవుతోంది. బొగ్గు వెలికితీతకు ఎలాంటి అంతరాయం కలుగడం లేదు. రక్షణ చర్యలపై ఏమాత్రం నిర్లక్ష్యం వహించడం లేదు.

– సంజయ్‌కుమార్ సిన్హా, గని మేనేజర్, శాంతిఖని

ఆధిపత్య పోరు !



పెద్దపల్లి జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే పీఎస్సార్

- వివేక్, పీఎస్సార్ వర్గీయుల్లో వర్గ విభేదాలు
- 'భట్టి' పర్యటనలో నొచ్చుకున్న పీఎస్సార్ కేడర్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అధికార కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు ఉన్నాయా..? 'గడ్డం' కుటుంబానికి పీఎస్సార్‌కు మధ్య బయటకు కనిపించని ఆధిపత్య పోరు కొనసాగుతోందా..? అంటే అవుననే అంటున్నాయి కింది స్థాయి పార్టీ వర్గాలు. గత కొంతకాలంగా జిల్లా నుంచే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో తమకు చోటు కల్పించాలని ముగ్గురు ఎమ్మెల్యేలు పోటాపోటీగా గాంధీ భవన్ మొదలు 'హస్తిన' దాకా లాబీయింగ్ చేస్తున్న విషయం తెలిసిందే. బెల్లంపల్లి, చెన్నూరు నుంచి ఎమ్మెల్యేలుగా గడ్డం సోదరులు వినోద్, వివేక్ ఉండగా, మంచిర్యాల నుంచి కే.ప్రేంసాగర్‌రావు(పీఎస్సార్) ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో వివేక్ తనయుడు వంశీక్రిష్ణ గెలుపునకు విభేదాలు పక్కన పెట్టి పని చేశారు. తాజాగా శనివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటనలో పీఎస్సార్ వర్గీయులు ఒకింత నొచ్చుకున్నట్లుగా కేడర్‌లో చర్చ మొదలైంది. డిప్యూటీ సీఎంకు అత్యంత సన్నిహితుడుగా ఉన్న పీఎస్సార్.. ఆయన ఉమ్మడి జిల్లాలో ఎక్కడికి వచ్చినా భారీగా ఏర్పాట్లు చేస్తుంటారు. అసెంబ్లీ ఎన్నికల ముందు సీఎల్పీ నేతగా ఉన్నప్పుడు 'భట్టి' నిర్వహించిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర మొదలు, మంచిర్యాల భారీ బహిరంగ సభ సక్సెస్ దాకా, ఇటీవల ఉట్నూరు, పిప్రిలోనూ డిప్యూటీ సీఎం హోదాలో వచ్చినప్పుడైనా పీఎస్సార్ తన మార్క్ చూపించేలా భారీగా ఏర్పాట్లు చేశారు. పార్టీ రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు వస్తే మంచిర్యాల నియోజకవర్గం నుంచి భారీగా కార్యకర్తలు, నాయకులు తరలి వెళ్తుంటారు.

నొచ్చుకున్న కేడర్ ?

తొలిసారిగా జిల్లాకు డిప్యూటీ సీఎం హోదాలో 'భట్టి' వస్తున్న నేపథ్యంలో ఫ్లెక్సీలు, కారు, బైక్ ర్యాలీతో స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేశారు. ఆ మేరకు శ్రీరాంపూర్ మీదుగా ఇందారం చౌరస్తా నుంచి జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్ వరకు అనేక వాహనాల్లో వందలాది మంది కార్యకర్తలు, నాయకులు చేరుకున్నారు. ఆ కార్యక్రమాలన్నీ చెన్నూరు నియోజకవర్గంలో ఉన్నాయి. అక్కడ పీఎస్సార్ కేడర్ ఆధిపత్యం కనిపించడంతో వివేక్ వర్గీయులు పోలీసులతో తమను రాకుండా అడ్డు చెప్పించారని నాయకులు ఆరోపిస్తున్నారు. తమ వాహనాలను 'ఇందారం క్రాస్' దాటి రావొద్దంటూ అక్కడున్న ఓ పోలీసు అధికారి తమ వాహనాలను నిలిపివేసినట్లుగా చెబుతున్నారు. విషయం పీఎస్సార్‌కు చేరడంతో మళ్లీ అనుమతి ఇచ్చినప్పటికీ ఆంక్షలపై వాపోయినట్లు తెలిసింది. ఈ ఘటనతో కేడర్ నొచ్చుకున్నట్లు చర్చ నడుస్తోంది. డీసీసీ అధ్యక్షురాలిగా ఉన్న పీఎస్సార్ సతీమణి సురేఖకు జిల్లా వ్యాప్తంగా ప్రోటోకాల్ ఉందని, తమకు ఇలా అడ్డు చెప్పడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. పోలీసు అధికారులు మాత్రం రోడ్డుపైన ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూశామని చెబుతున్నారు. మరోవైపు ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వంశీక్రిష్ణ చెన్నూరు పరిధిలో 'భట్టి' పర్యటన సాయంత్రం దాకా ఉంటుందని ఎదురు చూశారు. చివరకు రద్దు కావడంతో ఒకింత నిరాశకు గురయ్యారు. డిప్యూటీ సీఎం సొంత నియోజకవర్గం మధిరలో భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కార్యక్రమాలన్నీ రద్దు చేసుకుని హుటాహుటిన వెళ్లినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ఇందారం క్రాస్ హద్దు ?

మంచిర్యాల, చెన్నూరు నాయకులకు జైపూర్ మండలం ఇందారం క్రాస్ ఓ సరిహద్దుగా మారింది. ఇరువర్గాలకు రాజకీయంగా హద్దు గీత గీసినట్లు మారింది. జాతీయ రహదారిపై జిల్లాకు ప్రధాన దారిపై ఉన్న ఈ కూడలి ఇరు నియోజకవర్గాలకు భౌగోళికంగా ఓ హద్దుగానే ఉంది. గతంలో అప్పటి ఎమ్మెల్యే బాల్క సుమన్ ఫ్లెక్సీలు దారి పొడవున ఉండేవి. ఆ తర్వాత కాంగ్రెస్ సర్కారు వచ్చాక మొదట అక్కడున్న ప్రచార బోర్డులకు అనుమతులు లేవని అన్నీ తీయించారు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల సమయంలో అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలు వెలిశాయి. ఆ తర్వాత చెన్నూరు వైపు వివేక్ ఫ్లెక్సీలు, మంచిర్యాల వైపు పీఎస్సార్ ఫ్లెక్సీలు కనిపిస్తున్నాయి. దీంతో ఇందారం క్రాస్ ఇరువురు ఎమ్మెల్యేలకు ఓ హద్దుగా మారినట్లు చెప్పుకుంటున్నారు.

'భట్టి' పర్యటన రద్దు



చెన్నూర్ మండలం శివలింగాపూర్ సభా ప్రాంగణం నుంచి వెళ్లిపోతున్న ప్రజలు, నాయకులు

- ఖమ్మం, మధిరలో భారీ వర్షాలే కారణం
- స్వంత నియోజకవర్గానికి వెళ్లిన డిప్యూటీ సీఎం విక్రమార్క
- జైపూర్, చెన్నూర్ మండలాల్లో ప్రారంభోత్సవాలకు భారీగా ఏర్పాట్లు



పవర్‌ప్లాంటు అడ్మిన్ భవనంలో ఏర్పాట్లు

జైపూర్/చెన్నూర్‌రూరల్: మంచిర్యాల జిల్లాలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శనివారం పర్యటించాల్సి ఉండగా.. ఆకస్మికంగా పర్యటన రద్దయింది. రోజువారీ కార్యక్రమాల్లో ఆలస్యం, ఖమ్మం జిల్లా, డిప్యూటీ సీఎం సొంత నియోజకవర్గం మధిరలో భారీ వర్షాల కారణంగా పర్యటన రద్దు చేసుకున్నారు. కాగా, జైపూర్‌లోని ఎస్టీపీపీలో డిప్యూటీ సీఎం పర్యటన సందర్భంగా మూడు రోజులుగా సింగరేణి యంత్రాంగం పెద్దయెత్తున ఏర్పాట్లు చేసింది. ఎస్టీపీపీని సందర్శించి రిజర్వాయర్లపై నిర్మించిన తేలియాడే సోలార్‌ప్లాంటు, అడ్మిన్ భవనం, సీవో 2 మిథినాల్ ప్లాంటు ప్రారంభోత్సవం, కంట్రోల్ రూం ద్వారా విద్యుత్ ఉత్పత్తి వీక్షణ, 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంటు ఏర్పాటు ప్రతిపాదిత స్థల పరిశీలనకు ఏర్పాట్లు చేశారు. పెద్దపల్లి జిల్లాకు హెలికాప్టర్‌లో చేరుకున్న ఆయన రోడ్డు మార్గాన రావాల్సి ఉండగా.. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, సొంత నియోజకవర్గంలో వాగులు ఉప్పొంగడంతో అన్ని కార్యక్రమాలు రద్దు చేసుకుని అక్కడి నుంచే రోడ్డు మార్గాన వెళ్లిపోయారు. ఎస్టీపీపీ ప్రధాన ద్వారం నుంచి ఆయన ప్రారంభించే, సందర్శించే ప్రాంతాలను అధికారులు పూలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దగా 'భట్టి' రాకపోవడంతో అధికారులు కొంత నిరాశకు గురయ్యారు.

ప్రారంభోత్సవం వాయిదా

చెన్నూర్‌రూరల్: మండలంలోని శివలింగాపూర్ గ్రామ సమీపంలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్మించిన 11మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను శనివారం ప్రారంభించాల్సి ఉండగా.. డిప్యూటీ సీఎం పర్యటన రద్దుతో వాయిదా పడింది. ప్లాంటు ప్రారంభోత్సవం, పైలాన్ ద్వారా సోలార్ సబ్‌స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్ యార్డులు, శిలాఫలకం ఆవిష్కరణ, సభ నిర్వహణకు వేదిక కోసం శుక్రవారం నుంచి ఏర్పాట్లు చేశారు. విక్రమార్క రాక కోసం అధికారులు, ప్రజలు, నాయకులు గంటల తరబడి ఎదురుచూసి పర్యటన రద్దయిందని తెలిసి నిరుత్సాహంతో వెనుదిరిగారు.

వాతావరణ మార్పుల కారణంగా వాయిదా

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



చెన్నూర్‌లో ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వంశీకృష్ణలను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గం జైపూర్, శివలింగాపూర్‌లో సోలార్ పవర్‌ప్లాంట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించాల్సి ఉండగా వాతావరణంలో మార్పుల కారణంగా తాత్కాలికంగా వాయిదా పడిందని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. శనివారం కార్యక్రమాల రద్దుతో గోదావరిఖని నుంచి హుటాహుటిన పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణతో చెన్నూర్‌కు వచ్చారు. స్థానిక ఎంఆర్ఆర్ గార్డెన్‌లో ఎంపీతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివేక్ మాట్లాడారు. ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీకి సిద్ధంగా ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. వర్షాల కారణంగా డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయని, నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించానని తెలిపారు. డెంగీ ప్రబలితే ప్రజలు ఎక్కడికీ వెళ్లకుండా చెన్నూర్ ఆస్పత్రిలోనే చికిత్స పొందాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే, ఎంపీలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ విప్ నల్లాల ఓదెలు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి పాల్గొన్నారు.

విరాసత్‌కు ఆత్మల సంతకాలు!

దండేపల్లి: ఆత్మలు సంతకాలు చేయడమేమిటని ఆశ్చర్యపోతున్నారా..! నిజమే.. వారసత్వంగా వచ్చిన భూమిని విరాసత్ చేసేందుకు సంతకాలు చేశాయి. మంచిర్యాల జిల్లా దండేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దండేపల్లికి చెందిన గౌరై జానీకి ఎకరం 18గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఈయనకు ఇద్దరు కుమారులు పోలు, స్వామి ఉన్నారు. జానీ అతడి భార్య మరియ ఇద్దరూ కొన్నేళ్ల క్రితం చనిపోయారు. పెద్ద కుమారుడు పోలు కూడా గత జనవరిలోనే చనిపోయాడు. పోలు కుటుంబ సభ్యులకు తెలియకుండా.. తండ్రి పేరిట ఉన్న భూమిని స్వామి సక్సేషన్(విరాసత్ పట్టా)కు మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్నాడు. సక్సేషన్‌కు సంబంధించిన స్టేట్‌మెంటు రికార్డు సమయంలో అప్పటికే చనిపోయిన పోలు, మరియ సంతకాలను ఫోర్జరీ చేశారు. ఈ ఫైల్ ఆన్‌లైన్ ద్వారా తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీవో, అక్కడి నుంచి కలెక్టర్ లాగిన్ వరకు వెళ్లింది. ఈ విషయం బయటపడడంతో తహసీల్దార్ గమనించి సక్సేషన్(విరాసత్ పట్టా) రద్దు చేశారు. కాగా, స్టేట్‌మెంటు రికార్డు విషయంలో తనను తప్పుదారి పట్టించారని ఆర్ఐ చంద్రమౌళి శనివారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తహసీల్దార్ సంధ్యారాణిని సంప్రదించంగా, స్టేట్‌మెంట్ రికార్డు విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు ఆర్ఐకి మెమో జారీ చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడలు ప్రారంభం



క్రీడాజ్యోతితో నిర్వాహకులు, క్రీడాకారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామం చొక్కారాంనగర్ రాంపూర్ శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో ప్రాంత స్థాయి(రాష్ట్ర స్థాయి) క్రీడా పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండే క్రీడాజ్యోతిని వెలిగించి రాష్ట్ర స్థాయి ఖేల్‌ఖూద్ పోటీలు ప్రారంభించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రావుదేశ్‌పాండే, సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. సరస్వతీ విద్యాపీఠం మంచిర్యాల విభాగ్ అధ్యక్షుడు డాక్టర్ కే.విష్ణువర్ధన్‌రావు, తెలంగాణ ప్రాంత కార్యదర్శి ముక్కాల సీతారాములు, మంచిర్యాల విభాగ్ కార్యదర్శి దహెగావ్ గోవిందరావు, ప్రాంత అకాడమిక్ ఇంచార్జి కృష్ణమాచార్యులు, ప్రాంత ఖేల్‌ఖూద్ ప్రముఖ్ భీంసేన్‌రావు, ఖేల్‌ఖూద్ ప్రబంధకులు, 1500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

'ఎల్లంపల్లి' గేట్లు ఎత్తే అవకాశం..?



ఎల్లంపల్లి జలాశయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్ గేట్లు శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత గానీ, ఆదివారం గానీ ఎత్తే అవకాశం ఉంది. ఈ వర్షాకాలం సీజన్‌లో ఇప్పటివరకు గేట్లు ఎత్తలేదు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, కడెం ప్రాజెక్టు, ఎస్సారెస్పీల నుంచి వరద నీరు ప్రాజెక్టులోకి చేరుతోంది. పూర్తి స్థాయి నీటి మట్టం 20.175టీఎంసీలకు గాను శనివారం నాటికి 18.185 టీఎంసీల సామర్థ్యానికి చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో 11వేల క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 4వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుతోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 280 క్యూసెక్కులు, నంది పంప్‌హౌజ్‌కు 6,300 వేల క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. భారీ వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రాజెక్ట్‌లోకి నీరు చేరితే శనివారం అర్ధరాత్రి కానీ ఆదివారం కానీ ప్రాజెక్ట్ గేట్లు తెరుస్తామని ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ఈఈ జి.స్వామి ఓ ప్రకటన విడుదల చేశారు. దిగువ భాగాన పశువులు, గొర్రెలు నీటితీరాలకు రాకుండా పశు యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కంట్రోల్ రూమ్ నెం 08736-250501
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల సౌకర్యార్థం సమీకృత కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. రాబోయే రెండ్రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, జిల్లాకు ఎల్లో అలర్ట్ ఉందని, ప్రజ లు అవసరమైతేనే బయటకు రావాలని సూ చించారు. అధికారులు ఎల్లవేళలా అందుబా టులో ఉండాలని, వర్షాల కారణంగా సంభవించే పరిణామాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వరద ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజ లకు హెచ్చరికలు జారీ చేయాలని, పునరావా స కేంద్రాలు ఏర్పాటు చేసి అవసరమైన మేర కు ప్రజలను తరలించాలని తెలిపారు. కంట్రోల్ రూమ్ నంబరు 08736-250501లో సంప్రదించాలని, 24 గంటలు పని చేస్తుందని పేర్కొన్నారు.

కోర్టు భవనం పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న జడ్జి శ్రీనివాసులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో సీఐఎస్ఎఫ్ క్యాంపస్ ఆవరణలో చేపట్టిన జూనియర్ సివిల్ కోర్టు భవన పనులను జిల్లా జడ్జి బోయ శ్రీనివాసులు శనివారం పరిశీలించారు. కోర్టుకు అవసరమైన వసతులు, పార్కింగ్ తదితర ఏర్పాటు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం శిక్షణలో ఉన్న స్కౌట్, గైడ్స్‌ను కలిసి పలు అంశాలపై అవగాహన కల్పించారు. జూనియర్ సివిల్ జడ్జి సంపత్, ముకేష్, సింగరేణి ఏరియా ఎస్వో టు జీఎం రాజేశ్వర్ రెడ్డి, తహసీల్దార్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో గుత్తాధిపత్యం

- యూనివర్సిటీలో టెండరు లేకుండా కాంట్రాక్టర్లకు పనులు
- కాంట్రాక్టు గడువు ముగిసి రెండేళ్లయినా పాతవారినే కొనసాగింపు
- గత ప్రభుత్వం ఆదేశించినా మారని అధికారులు తీరు
- పనులు అప్పగించడం వెనుక భారీగా అక్రమాలు



ట్రిపుల్‌ఐటీ మెస్‌లో విద్యార్థినులతో మాట్లాడుతున్న అప్పటి గవర్నర్ తమిళసై (ఫైల్)



ట్రిపుల్‌ఐటీ పరిసరాలను పరిశీలిస్తున్న అప్పటి గవర్నర్ తమిళసై (ఫైల్)

భైంసా: విద్యార్థులకు ఉన్నతమైన విద్యాబోధనతో భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాల్సిన బాసర రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) అవినీతికి కేరాఫ్‌గా మారింది. విద్యార్థుల సంక్షేమానికి పాటుపడాల్సిన అధికారగణం కాంట్రాక్టర్ల సేవలో తరిస్తున్నారన్న విమర్శ సర్వత్రా వినిపిస్తోంది. కాంట్రాక్టర్ల నజరానాలకు ఆశపడో.. నేతల ఒత్తిళ్లకు తలొగ్గి నిబంధనలకు విరుద్ధంగా యూనివర్సిటీలో పనులు కేటాయిస్తున్నారు. ప్రభుత్వంలో ఏదైనా కాంట్రాక్టు అంటే గడువు ఉంటుంది. ఆ గడువు ముగియగానే నిర్వహణ, వివిధ పనుల కోసం టెండరు నిర్వహించి కొత్తవారిని నియమించాలి. ఈ ప్రక్రియ అంతా పారదర్శకంగా చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. కానీ, బాసర ట్రిపుల్ ఐటీ అధికారులు కాంట్రాక్టర్లు చెప్పిందే వేదంగా భావిస్తూ పాటిస్తున్నారు. కాంట్రాక్టు గడువు ముగిసి ఏళ్లు గడుస్తున్నా నిబంధనలకు విరుద్ధంగా పాతవారినే కొనసాగిస్తున్నారు. పాతవారిపై పలు ఆరోపణలున్నా.. వారి సేవలోనే తరిస్తున్నారు. ఇలా ఒకటి రెండు విషయాల్లో కాదు యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో ఉన్న ప్రైవేటు సంస్థల అన్ని కాంట్రాక్టు గడువులు ముగిసినా ఇంకా కొనసాగించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి కొన్ని సంస్థలపై ఫిర్యాదులు ఉన్నా చర్య తీసుకోకపోవడం, వెంటనే టెండర్లు నిర్వహించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ట్రిపుల్‌ఐటీ సమస్యలు తెలుసుకునేందుకు అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఇక్కడికి చేరుకుని మెస్‌లు, పరిసరాలు, వసతిగృహాలు తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అయినా ఎలాంటి మార్పురాలేదు. గత ప్రభుత్వ మంత్రులు కేటీఆర్, సబితాఇంద్రారెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి యూనివర్సిటీని సందర్శించిన సమయంలో ఆదేశించినా అధికారుల తీరు మారలేదు. పాతవారికే గడువు పెంచుతూ వస్తున్న అధికారులు వేసవిసెలవుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. టెండర్ వేస్తే ఏడాది కాలానికి కాంట్రాక్ట్ వస్తుంది కానీ ఇక్కడ అధికారులు కాంట్రాక్టర్లకు మూడు ఏళ్ల నుంచి రెన్యూవల్ చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో రూ.కోట్ల అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి

జరుగుతుంది ఇదీ...

- యూనివర్సిటీలో హౌస్ కీపింగ్ కాంట్రాక్టు గడువు ముగిసింది. గడువు కంటే రెండు నెలల ముందుగానే టెండరు ప్రక్రియ ముగించి కొత్త వారిని అధికారులు సిద్ధం చేయాలి. కానీ మూడేళ్లు గడిచినా పాతవారినే కొనసాగిస్తున్నారు. సరైన సమయానికి వేతనాలు ఇవ్వక, వారికి రావాల్సిన ప్రయోజనాలు అందజేయకపోవడంతో ప్రస్తుతం ఉన్న సంస్థ తీరును నిరసిస్తూ కార్మికులు అనేక సార్లు ఆందోళనలు చేశారు.
- క్యాంపస్‌లోని సెక్యూరిటీ బాధ్యతలు నిర్వహించే కంపెనీ కాంట్రాక్టు గడువు సైతం మూడేళ్ల క్రితమే ముగిసింది. ఇంకా సదరు కంపెనీనే అధికారులు కొనసాగిస్తున్నారు.
- యూనివర్సిటీలో 9 వేల మంది విద్యార్థులు ఉండగా వారి భోజన బాధ్యతలు, నిర్వహణను అధికారులు ప్రైవేటు క్యాటరింగ్ సంస్థలకు అప్పగించారు. ఈ మూడు క్యాటరింగ్ సంస్థల కాంట్రాక్టు గడువు ముగిసి రెండేళ్లు అవుతోంది. కానీ అధికారులు ఇప్పటి వరకు టెండర్లు పిలవడం లేదు. అనేకసార్లు విద్యార్థుల భోజనంలో పురుగులు రావడం, ఫుడ్ పాయిజన్ వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి పలు క్యాటరింగ్ సంస్థలపై అనేక ఫిర్యాదలు వచ్చాయి. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. టెండర్ లేకుండా పాతవారినే వారినే కొనసాగిస్తున్నారు.
- యూనివర్సిటీ పరిపాలన అవసరాల కోసం మ్యాన్ పవర్‌ను అందించే సంస్థ కాంట్రాక్టు గడువు ముగిసి రెండేళ్లవుతుంది. ఇంకా వారినే కొనసాగిస్తున్నారు.
- యూనివర్సిటీలో సూపర్‌మార్కెట్, హాస్టల్ భవనాల్లోని జనరల్ స్టోర్స్ ఎలాంటి టెండరు లేకుండా అధికారుల బంధువులకు కేటాయించారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్నేళ్ల నుంచి ఇవి అక్రమంగా కొనసాగుతున్నట్లు సమాచారం. అద్దె కూడా చెల్లించడం లేదని తెలిసింది. వీటిపై అనేక ఫిర్యాదులు ఉన్నా అధికారులు నోరు మెదపకపోవడం అనుమానాలకు తావిస్తోంది.
- ఈ కాంట్రాక్టు సంస్థలు, యూనివర్సిటీకి మధ్య ఒక ఏడాదిలో రూ.60 నుంచి రూ.90 కోట్ల వరకు లావాదేవీలు జరుగుతాయి. పెద్ద ఎత్తున జరిగే ఈ కాంట్రాక్టులు సమయానికి టెండర్ లేకుండా కొనసాగించడానికి అదే స్థాయిలో అవినీతి జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

త్వరలోనే అన్ని టెండర్లు పిలుస్తాం..

యూనివర్సిటీలో గడువు ముగిసి పలు కాంట్రాక్టు సంస్థల స్థానంలో కొత్త టెండర్లు పిలవడంతో కొంత జాప్యం జరిగింది. గడువు ముగిసిన అన్ని కాంట్రాక్టు సంస్థల స్థానంలో కొత్త టెండర్ ఫైళ్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అవి రెడీ కాగానే కొత్త టెండర్లు పిలిచి కాంట్రాక్టు అప్పగిస్తాం.

– ప్రొఫెసర్ వెంకటరమణ, ఇన్‌చార్జి వీసీ

ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విష్ణుకుమార్‌తో హెచ్ఎం, పీడీ

కాసిపేట: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి బానోతు విష్ణుకుమార్ ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సాంబమూర్తి తెలిపారు. క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం మందమర్రి మండలం బొక్కలగుట్టలో జిల్లాస్థాయి అండర్-14 ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. విష్ణుకుమార్ ప్రతిభ కనబర్చి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థినిని, పీడీ భుక్య రాజన్నను అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ స్వరూప, ఉపాధ్యాయులు అభినందించారు.

రైళ్లు తాత్కాలికంగా రద్దు

బెల్లంపల్లి: రోజువారీగా ప్రత్యేక రోజుల్లో రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తూ ద.మ.రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కాజీపేట-బల్లార్షా మార్గంలో నడిచే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసి మరికొన్ని సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారిమళ్లించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. రైళ్ల తాత్కాలిక రద్దు ప్రక్రియ ఈనెల 22 నుంచి ప్రారంభం కానుంది. వరంగల్, హసన్‌పర్తి, కాజీపేట్ రైల్వేస్టేషన్లలో రైల్వే ట్రాక్ మరమ్మతు దృష్ట్యా రద్దు నిర్ణయం తీసుకున్నట్లు ద.మ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ తెలిపారు.

క్లుప్తంగా

దొంగతనం కేసులో ఒకరికి రిమాండ్

కాసిపేట: దొంగతనం కేసులో ఒకరిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపారు. దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుంగగూడంలో గతనెల 25న మేకల పద్మ ఇంటికి తాళం వేసి ఉంది. ఆమె మరిది కొడుకు శశికుమార్ తాళం పగులగొట్టాడు. బీరువాలో రూ.90 వేలు ఎత్తుకెళ్లారని బాధితురాలు ఫిర్యాదుతో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్టు

బెల్లంపల్లిరూరల్(తాండూర్): సులభంగా డబ్బులు సంపాదించేందుకు ఓ వ్యక్తి ఇంటి పరిసరాల్లో గంజాయి సాగు చేసి పోలీసులకు పట్టుబడ్డాడు. తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. తాండూర్ మండలం బోయపల్లి సమీపంలో జాతీయ రహదారి పక్కన దాబా నిర్వహిస్తున్న భటేశ్వర్‌రాయ్ తన ఇంటి పరిసరాల్లో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నాడని సమాచారం అందింది. పోలీసులు శనివారం అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా ఒక గంజాయి మొక్క, 44 గ్రాముల ఎండు గంజాయి లభించినట్లు ఎస్సై తెలిపారు. భటేశ్వర్ రాయ్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. గంజాయి సాగు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



రవి (ఫైల్)

దండేపల్లి: గూడెం గ్రామానికి చెందిన గోపతి రవి (42) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..రవి గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆసుపత్రి ఖర్చుల కోసం కొంత అప్పు చేశాడు. అయినప్పటికీ కడుపు నొప్పి తగ్గకపోవడం, పైగా వైద్యఖర్చుల కోసం అప్పులు కావడంతో మనస్తాపం చెందాడు. శనివారం పత్తిచేను వద్దకు వెళ్లి గుర్తుతెలియని పురుగు మందు తాగి ఇంటికి వచ్చి కుటుంబీకులకు విషయం చెప్పాడు. వెంటనే వారు ఆటోలో లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. భార్య సుమలత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

జ్వరంతో విద్యార్థిని మృతి

వాంకిడి: మండలంలోని ఇందానికి చెందిన ఐశ్వర్య (17) జ్వరంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఐశ్వర్య గత వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతుంది. తల్లిదండ్రులు మంగళ- భీమ్‌సన్ ఆమెను మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. కొన్నిరోజులు బాగానే ఉన్నా శుక్రవారం మళ్లీ అస్వస్థతకు గురైంది. శుక్రవారం రాత్రి మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కాగా, ఐశ్వర్య మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండియర్ బైపీసీ గ్రూప్‌లో చదువుతుంది. ఆమె మృతిపట్ల అధ్యాపకులు, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేసి కళాశాలకు సెలవు ప్రకటించారు.

కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల ధర్నా



నినాదాలు చేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు

బెల్లంపల్లి: ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కాంట్రాక్టు పారిశుధ్య సిబ్బంది శనివారం ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్ మూడు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉండగా ఒక నెల వేతనాలు చెల్లించి చేతులు దులిపేసుకున్నారని విమర్శించారు. వేతనాలు అడిగితే ఉద్యోగంలో నుంచి తొలగిస్తామని బెదిరింపులకు గురి చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రతినెల వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వేడుకున్నారు. అనంతరం జిల్లా వైద్య విధాన పరిషత్ కో ఆర్డినేటర్ కోటేశ్వర్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

పీహెచ్‌సీల్లో వైద్యులను నియమించాలి



మాట్లాడుతున్న రవికుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో శనివారం నిర్వహించిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టులకు ప్రత్యేక నిధులు కేటాయించి పూర్తిచేసి కాలువల ద్వారా రైతులకు సాగునీరందించాలన్నారు. జిల్లాలో వైద్యశాఖ పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. సబ్, ప్రైమరీ, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల ద్వారా జిల్లా కేంద్రంలో 44 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం 12 మంది ఉన్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో విష జ్వరాలు ఉన్నాయని, ఇంటర్ చదువుతున్న బాలిక విషజ్వరంతో మృతి చెందడం బాధాకరమన్నారు. విద్యాశాఖలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు నీరు, మరుగుదొడ్లు, రక్షణ ప్రహరీ తదితర వసతులు కరువయ్యాయని అన్నారు. గిరిజన బాలికల డిగ్రీ, ఆశ్రమ బాలికల పాఠశాల సొంత భవనాలు నిర్మించాలన్నారు. సమావేశంలో నాయకులు రాజన్న, దినకర్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, రాజేందర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న డీఎస్పీ కరుణాకర్

కాగజ్‌నగర్‌రూరల్: శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేస్తున్నారని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ తెలిపారు. పట్టణంలోని కాపువాడ, భట్‌పల్లి చౌరస్తా వద్ద శనివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని వంద బైక్‌లు, మూడు ఆటోలను సీజ్ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద గంజాయి సేవించే యువకులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. మట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పట్టణ సీఐ శంకరయ్యతోపాటు రూరల్, కౌటాల, వాంకిడి సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వట్టివాగు ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత

ఆసిఫాబాద్‌రూరల్: వట్టివాగు ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నట్లు సంబంధిత అధికారులు శనివారం తెలిపారు. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి ప్రాజెక్టులో నీరు ఎక్కువ కావడంతో 3, 4గేట్లు 0.50 మీటర్లు పైకి ఎత్తి 1800క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



కిచెన్ రూమ్‌ను పరిశీలిస్తున్న డీడీ

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టిసారించాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం 'లెక్కతప్పుతోంది..!'శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించారు. స్థానిక సాంఘిక సంక్షేమ కళాశాల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కిచెన్ స్టోర్‌ను పరిశీలించారు. హాస్టల్ రూమ్, బాత్రూంలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కిచెన్ షెడ్ లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని విద్యార్థులు డీడీ దృష్టికి తీసుకువచ్చారు. ఏఎస్‌డబ్ల్యూవో ఆఫీస్ ఇక్కడే ఉండటం వల్ల అసౌకర్యంగా ఉందనగా, సమస్య పరిష్కరిస్తానని హామీఇచ్చారు. ప్రతీ 15రోజులకోసారి మెడికల్ క్యాంపు నిర్వహించాలని, మున్సిపల్ అధికారులతో సంప్రదించి శానిటేషన్ చేయించాలన్నారు. ఆయన వెంట హెచ్‌డబ్ల్యూవో కుమారస్వామి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బీసీ, ఎస్టీ హాస్టల్‌లో తనిఖీలు ఉంటాయని ఆయా వార్డెన్లు అలర్ట్ అయ్యారు. మెనూ ప్రకారం భోజనం పెట్టినట్లు తెలుస్తోంది.

దమ్మాల శ్రీనివాస్‌కు గద్దర్ అవార్డు



గద్దర్ అవార్డు తీసుకుంటున్న దమ్మాల శ్రీనివాస్

శ్రీరాంపూర్/పాతమంచిర్యాల: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా రిటైర్డ్ కార్మికుడు, కళాకారుడు దమ్మాల శ్రీనివాస్‌కు గద్దర్ అవార్డు అందుకున్నారు. శుక్రవారం వరంగల్ జిల్లా తొర్రూర్‌లో ఈ పురస్కారం అందజేశారు. గద్దర్ కూతురు వెన్నెల, తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీ, ప్రొఫెసర్ ఖాసీం చేతులు మీదుగా అవార్డు అందించారు. తనకు గద్దర్ అవార్డు రావడంపై దమ్మాల శ్రీనివాస్ సంతోషం వ్యక్తం చేశారు.



గద్దర్ పురస్కారంతో మురళి..

మండల వాసికి..

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్‌కు చెందిన కళాకారుడు ముల్కల్ల మురళి గద్దర్ పురస్కారం అందుకున్నాడు. గాయకుడిగా గుర్తింపు పొందిన మురళీ తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ ధూంధాం కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. సినిమాలు, వీడియో ఆల్బమ్‌లలో నటించాడు. తొర్రూర్‌లో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో మురళికి గద్దర్ పురస్కారం అందజేశారు.

పాత పెన్షన్ పునరుద్ధరించాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కోటపల్లి: సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహదినం సందర్భంగా కాంట్రీ బ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాసరావు అన్నారు. శనివారం దేవులవాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసేవారికి ఎలాంటి భరోసా ఇవ్వని సీపీఎస్ రద్దు చేయాలన్నారు. ఉద్యోగుల ప్రభుత్వ భాగస్వామ్య డబ్బును షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టి దాని ద్వారా వచ్చే ప్రతిఫలాన్ని పెన్షన్‌గా ఇవ్వడం సరికాదన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ దిశగా అడుగులు వేసి అమలు చేయాలని కోరారు. లేకపోతే తపస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు భూమయ్య, శ్రీనివాస్, గోపి పాల్గొన్నారు.

కెలిబి శివారులో పులి పాదముద్రలు!



పులి పాదముద్రలు



పులి పాదముద్రలను పరిశీలిస్తున్న అధికారులు

- ఆందోళన చెందుతున్న ప్రజలు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని కెలిబి శివారులో మొహర్లే రమేశ్, ప్రకాశ్‌లకు చెందిన పొలాల సమీపంలో ఉన్న చెరువు వద్ద గురువారం పులి పాదముద్రలు కనిపించాయి. ఐదారు రోజులుగా పొలంలో అరక దున్నుతున్నప్పుడు ఎడ్లు చెరువు వద్దకు వెళ్లగానే వెనక్కు మళ్లుతున్నాయని, ఇదేమిటని శనివారం చెరువువద్ద వెళ్లి చూడగా పందిని హతమార్చినట్లు తెలిసిందని రైతులు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఎఫ్ఆర్వో మజారొద్దీన్‌కి తెలుపగా అటవీ సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి చూశారు. పులి పాదముద్రలుగా గుర్తించి, మూడు రోజుల క్రితం ఏర్పడినవని తెలిపారు. పులి సంచారం విషయం సమీప గ్రామాల ప్రజలకు దావానంలా వ్యాపించడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆదివారం గ్రామసభలు నిర్వహించి ప్రజలకు పలు సూచనలు ఇస్తామని ఎఫ్ఆర్వో తెలిపారు. అధికారులు స్రవంతి, వందన, నజీర్‌అలీ, జమీర్, గౌసుద్దిన్ ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

రామకృష్ణాపూర్: గంజాయి విక్రయిస్తున్న నలుగురిని శనివారం అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పట్టణంలోని సీహెచ్‌పీ సమీపంలో గల సింగరేణి బీ టైపు క్వార్టర్స్‌లో గంజాయి సేవిస్తూ అమ్మకాలు సాగిస్తున్నారన్న సమాచారంతో పట్టణ ఎస్ఐ రాజశేఖర్ తన సిబ్బందితో కలిసి వెళ్లారు. వారిని చూసిన నలుగురు తమ వద్ద ఉన్న ఓ కవర్‌తో పారిపోయే ప్రయత్నం చేయగా వెంటనే పట్టుకున్నారు. కవర్‌ను తెరిచి చూడగా అందులో 355 గ్రాముల గంజాయి దొరికిందని ఏసీపీ వివరించారు. నిందితులు కొలిపాక అరవింద్‌రెడ్డి, జాడి కిరణ్, వేల్పుల రాకేశ్, మహమ్మద్ షఫీలను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, పట్టణ ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చకపోతే సమ్మె



నిరసన తెలుపుతున్న కన్వేయన్స్ డ్రైవర్లు

శ్రీరాంపూర్: తమ డిమాండ్లు నెరవేర్చకుంటే ఈనెల 11 తర్వాత సమ్మె తప్పదని సింగరేణి కాంట్రాక్ట్ కన్వేయన్స్ డ్రైవర్లు తెలిపారు. శనివారం సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఓసీపీ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ మాట్లాడారు. డ్రైవర్లకు అరకొర వేతనాలు అందుతున్నాయని తెలిపారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఉద్యోగ భద్రత ఉండటం లేదన్నారు. ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ ఇటీవల యజమానికి సమ్మె నోటీస్ ఇచ్చామన్నారు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే సమ్మె చేస్తామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు రాజేశం తదితరులు పాల్గొన్నారు.

'చట్టసభల్లో వాటా లక్ష్యంగా పోరాటాలు'

పాతమంచిర్యాల/జైపూర్: చట్టసభల్లో రాజకీయ వాటాలే లక్ష్యంగా పద్మశాలీలు పోరాటాలు కొనసాగించాలని తెలంగాణ ప్రాంతీయ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి పిలుపునిచ్చారు. శనివారం ఆయన మంచిర్యాల, జైపూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2028లో జరిగే ఎన్నికల్లో చట్టసభల్లో రాజకీయ వాటా కోసం పద్మశాలీలను చైతన్యం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రాంచందర్, కోశాధికారి రఘురాం, జిల్లా సంఘం అధ్యక్షుడు గాదాసు బాపు, ప్రధాన కార్యదర్శి వేముల వీరాస్వామి, వేముల మల్లేశ్, దుస్స భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో కుళ్లిన కోడిగుడ్లు

కోటపల్లి: మండలంలోని ఎసన్‌వాయి అంగన్‌వాడీ కేంద్రానికి కుళ్లిన కోడిగుడ్లు సరఫరా అవుతున్నాయి. గ్రామంలో ఒకరి ఇంట్లో ఉడకబెట్టగా..దుర్వాసన రావడంతో పడేశారు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయింది. రోజుల తరబడి నిల్వ ఉన్న కోడిగుడ్లతో చిన్నారులు, బాలింతలు అనారోగ్యం పాలవుతున్నారు. గతనెలలో ఇలా రెండోసారి ఇదే సెక్టార్‌లో కుళ్లినవి, నాసిరకం గుడ్లు సరఫరా చేయడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై సూపర్‌వైజర్ మాధవిని వివరణ కోరగా కుళ్లిన గుడ్లు వస్తే తిరిగి వెనక్కి ఇవ్వాలని టీచర్లకు సూచించామన్నారు.